# సాక్షి తిరుపతి

బుధవారం । 24 । జూలై । 2024






## అధ్యక్షా.. ఇదే మా ఆకాంక్ష

ఎమ్మెల్యేలు జిల్లాలోని సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పాలని, అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. - IIలో



## అంగన్‌వాడీ టీచర్‌పై వేధింపులు

టీడీపీ నేతల ఒత్తిళ్లతో ఓ అంగన్‌వాడీ కార్యకర్తపై ఐసీడీఎస్ అధికారులు వేధింపులకు దిగారు. - IIలో



## పగతోనే చంపేశాడు!

తనపై తప్పుడు ప్రచారం చేశారన్న పగతో ఓ వృద్ధురాలిని అతికిరాతకంగా చంపేసిన ఘటన తిరుపతిలో చోటుచేసుకుంది. - IIలో

# సీతకన్ను



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పద్దు నిరాశ మిగిల్చింది. కూటమి ప్రభుత్వం భాగస్వామ్యమున్నా ఆధ్యాత్మిక జిల్లాకు మొండి చేయ్యే చూపింది. కొత్త ప్రాజెక్టుల ఊసెత్తకపోగా.. ఉన్న అరకొర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు కూడా పైసా విదల్చని పరిస్థితి నెలకొంది. రైల్వే ప్రాజెక్టులను.. కొత్త రైల్వే లైన్లను కొండెక్కించింది. నిర్మాణంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలపైనా శీతకన్నే వేసింది. జాతీయ రహదారుల నిర్మాణానికి మోకాలొడ్డింది. మన్నవరం బెల్ పరిశ్రమ పునరుద్ధరణ కలగానే మిగిల్చింది. ఐఐటీ, ఐజర్ సంస్థలను సైతం విస్మరించింది. ప్రధానంగా తిరునగరిలో అండర్ డ్రైనేజీకి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు వస్తాయన్న స్థానికుల ఆశలను అడియాశలు చేసింది. ఎస్వీయూలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌కు నిధుల కేటాయింపు లేకుండాపోయింది. దీనిపై మేధావి, విద్యార్థి, నిరుద్యోగ వర్గం పెదవి విరుస్తోంది.

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేకంగా నిధులు కేటాయించని నిర్మలమ్మ
- నూతన పరిశ్రమలు లేవు... ఉన్న కేంద్ర సంస్థలకు నిధులూ లేవు
- మన్నవరం మాటెత్తని వైనం
- నిర్మాణంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలపైనా శీతకన్నే
- నూతన రైల్వే లైన్లు, విస్తరణ, స్టేషన్ల అభివృద్ధిపై నోరెత్తని కేంద్రం
- బడ్జెట్‌పై మండిపడుతున్న విద్యావంతులు, మేధావులు

**తిరుపతి సిటీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తిరుపతి జిల్లా ప్రజలను నిరాశపరిచింది. రాయలసీమలోని వెనుకబడిన జిల్లాలకు మాత్రం ప్రత్యేక నిధులు కేటాయింపు జరుగుతుందని మాత్రమే ప్రస్తావించారు తప్ప.. కేటాయింపులపై స్పష్టత ఇవ్వలేదు. కనీసం జిల్లాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కేంద్ర సంస్థలకు నిధులు, నూతన పరిశ్రమల ఏర్పాటు, విద్యాసంస్థల అభివృద్ధి, ఆస్పత్రులపై కనీసం మాట వరసకైనా బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. విభజన చట్టంలోని హామీలపై కూడా స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల విస్తరణ, నూతన రైల్వే లైన్లు, పెండింగ్‌లో ఉన్న రైల్వే స్టేషన్ పనులు, అండర్ రైల్వే బ్రిడ్జీలు, సెంట్రల్ బస్టాండ్, ప్రధాన నగరాలలో నూతన డ్రైనేజ్ వ్యవస్థ వంటి అంశాలపై కేంద్రం బడ్జెట్‌లో నేరెత్తకపోవడం శోచనీయమని మేధావులు పెదవి విరుస్తున్నారు.

**పలుమార్లు విన్నవించినా..**

కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్వీయూలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, మన్నవరం పునరుద్ధరణ, ఐఐటీ, ఐజర్ వంటి విద్యాసంస్థల గురించి ప్రస్తావనలేదు. చెన్నై- విశాఖపట్నం కారిడార్ అభివృద్ధి అంటూ ప్రస్తావించినా స్పష్టత ఇవ్వలేదు. పలుమార్లు ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన పార్లమెంట్‌లో వినిపించినా నిధుల కేటాయింపుపై ఎటువంటి హామీ వినిపించలేదు. దీనిపై మేధావలు, విద్యావంతులు, సీనియర్ సిటిజన్లు మండిపడుతున్నారు. జిల్లాలో ప్రధానంగా నూతన డ్రైనేజీ వ్యవస్థ, కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, జాతీయ రహదారులు, తిరుపతి జిల్లాకు కేంద్ర ప్రభుత్వ సహకారం వంటి పలు అంశాలపై పలుమార్లు పార్లమెంట్లో ఎంపీ గురుమూర్తి తన వాణిని వినిపించినా ఫలితం లేకపోవడం దారుణమని జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నిరాశ బడ్జెట్



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ మిగిల్చింది. ఇది కార్పొరేటర్లకు అనుకూల బడ్జెట్. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించకపోవడం దుర్మార్గం. పోలవరం, రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించక నామమాత్రపు నిధులతో గొప్పగా డప్పు కొట్టుకుంది. తిరుపతిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నా నిధులు కేటాయించలేదు. ఇప్పుడు హడావుడిగా కండలేరు డ్యామ్ కట్టను తెగ్గొట్టి నీటిని మళ్లించడంతో రానున్న రోజుల్లో తీరని నష్టం జరిగే ప్రమాదం ఉంది. పడమటి ప్రాంతాల్లో సాగు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయకపోవడం బాధాకరం. **– పి.హరినాథ్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నేత**

### వేతన జీవులకు నిరాశే



పాత పన్నుల విధానంలో మార్పు తీసుకురాకుండా కొత్త పన్ను విధానంలో స్వల్ప మార్పులు తీసుకొచ్చి అమలు చేయడం ద్వారా ఈ బడ్జెట్ వేతన జీవులకు నిరాశను మిగిల్చింది. సీపీఎస్ విధానంలో మార్పులు చేస్తామంటూ చెబుతూనే ఓపీఎస్ అమలుపై ప్రకటన లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా నిరాశపరిచింది. ఉద్యోగుల ఆదాయ పన్నుకు సంబంధించి కొత్త విధానంలో అధిక పన్ను చెల్లించాల్సి రావడంతో ఎక్కువ మంది పాత విధానం వైపు మొగ్గు చూపుతున్నారని, అయితే కేంద్రం ఆ దిశగా రాయితీలు లేకుండా చేయడం నిరాశనే మిగిల్చింది. విద్యారంగానికి 6 శాతం కాకుండా కేవలం 3.25 శాతం నిధులు కేటాయించడం దారుణం.

**–కె.ముత్యాలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్**

### రాష్ట్రానికి ఇచ్చేది గ్రాంటా.. అప్పా?



రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో ఏపీ రాజధాని నిర్మాణానికి నేరుగా సాయం అందిస్తామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి చెప్పకపోవడమం శోచనీయం. మల్టీలేటరల్ డెవలప్‌మెంట ఏజెన్సీల ద్వారా రూ.15 వేల కోట్ల ఆర్థిక మద్దతు అందిస్తామని పేర్కొనడం విడ్డూరంగా ఉంది. రాజధాని నిర్మాణానికి రూ15 వేల కోట్లు గ్రాంటా? లేక అప్పా? అనేది తేల్చాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పు భారాన్ని మోపొద్దు. రాష్ట్రానికి గ్రాంట్ రూపంలోనే ఇవ్వాలి. పోలవరాన్ని పూర్తి చేస్తామని పదేళ్లుగా కేంద్రం చెబుతున్నా కావాల్సినన్ని నిధులు ఇవ్వడంలేదు. వెనుకబడిన జిల్లాలకు ఎంత మేరకు సాయం చేస్తారనే విషయంపై స్పష్టత లేదు. ప్రస్తుత బడ్జెట్‌లో పోలవరానికి అవసరమైన నిధులు ఇస్తామన్నారే తప్ప, ఎంత ఇస్తారనే దానిపై కేంద్ర ఆర్థిక మంత్రి క్లారిటీ ఇవ్వలేదు. కార్మిక రైతాంగానికి, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ ఎందుకు కేటాయించలేదు.

**పి.మురళి,**
**సీపీఐ జిల్లా కార్యదర్శి**

### మాటలు ఘనం..నిధులు నిల్



కేంద్రం బడ్జెట్‌లో రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు నిధులు అంటూ ఊదరగొట్టిన ఆర్థిక మంత్రి కనీసం ఎంత నిధులు, ఏయే అంశాలపైన కేటాయిస్తారనే మాటేలేదు. తిరుపతి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేంద్ర సంస్థలపై ఊసెత్తలేదు. జాతీయ రహదారులు, రైల్వే వ్యవస్థపైన చిన్న చూపు చూశారు. సామాన్యుడికి ఈ బడ్జెట్ ఉపయోగపడలేదు. అమరావతికి రూ.15వేల కోట్లు ప్రైవేటు సంస్థల నుంచి అప్పు ఇప్పిస్తామని చెప్పడం దారుణం

**–వందవాసి నాగరాజ, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి**

### ఉద్యోగ, కార్మిక వ్యతిరేఖ బడ్జెట్



నిర్మలా సీతారమన్ బడ్జెట్ పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ప్రజలను నిరాశపరిచింది. ఎప్పటిలాగే జిల్లా ప్రజలు మరో సారి మోసపోయారు. వికసిత్ భారత్ అంటూ మీడియాలో ప్రగల్బాలు పలుకుతూ ప్రచారం చేశారు. బడ్జెట్‌లో ఆ దిశగా నిధులు కేటాయింపులు జరగలేదు. ప్రతి ఏడాదీ కోటి మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి మరో ఎత్తుగడకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగం కల్పించే యజమానికి లాభం చేకూర్చే విధంగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈపీఎఫ్ పెన్షనర్లు తమ కనీస పెన్షన్‌ను పెంచమని గత కొంతకాలంగా విన్నవించినా బడ్జెట్‌లో ఆ ప్రస్తావనేలేదు.

**–కందారపు మురళి, సీఐటీయూ, ప్రధాన కార్యదర్శి, తిరుపతి**

### నిరాశపరిచింది



కేంద్ర బడ్జెట్ అంటే ఆధ్యాత్మిక నగరానికి కచ్చితంగా కేటాయింపులు ఉంటాయిని అందరూ భావించాం. విద్య, వైద్యం, పరిశ్రమల స్థాపనకు జిల్లాలో పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. అటువంటి జిల్లాపై కేంద్రం చిన్న చూపు చూసింది. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులుగా ఉన్న ఏపీ ప్రాంతీయ పార్టీలు ఆలోచించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సంస్థలు చాలా వరకు నిర్మాణంలో ఉన్నాయి. మాటవరుసకైనా జిల్లాను ప్రస్థావించకపోవడం శోచనీయం.

**–ఎఎస్.పరమేశ్వరరావు, పౌర చైతన్యవేదిక జిల్లా కార్యదర్శి, తిరుపతి జిల్లా**

### కూటమి నేతలు స్పందించాలి



బడ్జెట్‌లో జిల్లా ప్రస్తావన లేకపోవడం శోచనీయం. దేశంలో తిరుపతికి ప్రత్యేక స్థానం ఉంది. అటువంటిది కేంద్ర బడ్జెట్ పూర్తి పాఠం వింటే ఆశ్చర్యమేసింది. రైల్వే, బస్టాండ్, జాతీయ రహదారులు, కోస్టల్ తీరంపై ఈ బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తారని ఆశించాం. కనీస ప్రస్తావన లేకుండా, అమరావతి ఇచ్చే నిధులపై పూర్తి స్పష్టత లేదు. గతంలో ఎన్నో బడ్జెట్లు చూశాం. విశ్లేషించాం. కానీ ఇంతదారుణంగా బడ్జెట్ ఉంటుందని ఆలోచించలేదు. ఎంపీ గురుమూర్తి పలు మార్లు జిల్లా సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపించారు. అదేవిధంగా స్వయంగా కేంద్ర మంత్రులను కలసి జిల్లా సమస్యలపై విన్నవించారు. జిల్లాకు బడ్జెటలో నిధులు కేటాయించకపోవడంపై కూటమి నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలి.

**–రాజేంద్ర ప్రసాద్,**
**విశ్రాంత కేంద్ర గణాంకశాఖ సీనియర్ ఆఫీసర్, తిరుపతి**

### ప్రజాప్రతినిధులు బడ్జెట్‌పై నిలదీయాలి



కేంద్ర మంత్రి మంగళవారం పార్లమెంటులో చదివిన బడ్జెట్ పూర్తిగా సత్యదూరం. ఆంధ్రప్రజలను మభ్యపెట్టినట్లు కనబడుతోంది. కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన పార్టీలు ఈ బడ్జెట్‌పై స్పందించాలి. స్పెషల్ స్టేటస్ లేదు, ప్యాకేజీ మాటలే అధికంగా వినిపించాయి. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తారని నిరుద్యోగులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. కానీ నిరుద్యోగులను పట్టించుకున్న పాపానపోలేదు. కేంద్ర విద్యాసంస్థల అభివృద్ధిని సైతం పట్టించుకోలేదు.

**– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి**

### స్వల్ప ఊరట



కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు స్వల్ప ఊరటే లభించింది. ఆదాయ పన్ను స్లాబ్ రేట్లను కొత్త విధానంలో సవరించడం, స్టాండర్డ్ డైరెక్షన్ 50 వేల నుంచి 75 వేలకు పెంచడం ద్వారా ఉద్యోగులకు స్వల్ప ఊరటనిచ్చినట్టయ్యింది. ఇంకా ఉదారంగా ఆలోచించి ఉద్యోగులకు లబ్ధి చేకూరేలా పాత విధానంలోనూ మార్పులు చేసి ఉండాల్సింది.

**ఎస్.బాలాజీ, రాష్ట్ర అధ్యక్షులు, ఆపస్**

## న్యూస్‌రీల్

### ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

- సీఐ, ఎస్ఐలకు మెమోలు

**పాకాల:** పాకాలలో ఈ నెల 21వ తేదీన జరిగిన గొడవలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ముందస్తుగా సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించిన ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యంరెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇన్‌చార్జ్ సీఐ శ్రీరాముడు, ఎస్ఐలు ఇషాక్‌బాషా, ఆర్.లోకేషకుమార్‌కు మెమోలు జారీచేశారు. గోడవలకు సబంధించిన ఘటనపై తక్షణం వివరణ ఇవ్వాలని కోరారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీశాఖలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేంది లేదని ఎస్పీ హెచ్చరించారు. ముఖ్యంగా విధుల్లో జవాబుదారీతనం లోపిస్తే కఠిన చర్యలు సుకుంటామని వివరించారు.

### రిసార్ట్స్'కు భూములు కేటాయించండి

**తిరుపతి అర్బన్:** గూడూరు డివిజన్ వాకాడు మండలంలోని తూపిలిపాళెం బీచ్‌లో పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేయనున్న రిసార్ట్స్‌కు కేటాయించిన 6.5 ఎకరాల భూమిని వారికి అప్పగించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గూడూరు డివిజన్ రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖకు ఇవ్వాల్సిన భూముల విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆగస్టులో అన్నా క్యాంటీన్లు



గూగుల్ మీట్ ద్వారా ఎంపీడీవోలకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** అన్నా క్యాంటీన్లు ఆగస్టు 15 నాటికి జిల్లాలో 11 చోట్ల అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన గూగుల్ మీట్ ద్వారా మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. తిరుపతిలో ఎంఆర్‌పల్లి, ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద, నెహ్రూ మున్సిపల గ్రౌండ్, న్యూ బాలాజీ కాలనీలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తిలో రామసేతు వంతెన, ప్రభుత్వాస్పత్రి వద్ద, నాయుడుపేటలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద, సూళ్లూరుపేటలో కళాక్షేత్రం సమీపంలోని గాంధ్ల వీధిలో, గూడూరు పాత బస్టాండ్ సమీపంలోని బొగ్గుల దిబ్బ వద్ద, వెంకటగిరిలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, పుత్తూరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద అన్నా క్యాంటీన్లు నిర్వహించాలని ఆదేశించారు. ఆ మేరకు ఆగస్టు 10వ తేదీనాటికి పూర్తి చేయాలని చెప్పారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,939 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,327 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.90 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

## ఘనంగా సైన్స్ దినోత్సవం



భువనేశ్వర్‌లో జాతీయ సైన్స్ డే బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

**సూళ్లూరుపేట:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఆగస్టు 23 దాకా దేశవ్యాప్తంగా సైన్స్ దినోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఇస్రో చంద్రయాన్–3 ప్రయోగంలో ల్యాండర్, రోవర్‌ను విజయవంతంగా ఆగస్టు 23న చంద్రుని ఉపరితలంపై దించిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆ రోజును జాతీయ సైన్స్‌డే ప్రకటించిన విషయం తెలిసిందే. జాతీయ సైన్స్‌డే మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్, సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఒడిశాలోని భువనేశ్వర్‌లో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. రాకెట్ సైన్స్ గురించి కూడా నేటి తరం విద్యార్థులకు తెలియజేసేందుకు సెమినార్లు కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 23న సతీష్ ధవన్ స్పేస్‌సెంటర్‌లో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని షార్ డైరెక్టర్ రాజరాజన్ తెలిపారు.

## పారదర్శకంగా ఉద్యోగాల ఎంపిక



ఎస్.జయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

**తిరుపతి అర్బన్:** ఐసీడీఎస్ పరిధిలో పోషణ్ అభియాన్ పేరుతో ఈ ఏడాది మార్చి 4న ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ ఎస్.జయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్ధతిలో 9 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ నేతృత్వంలో ఓ కమిటీ పర్యవేక్షణలో ఎంపిక ఉంటుందన్నా రు. 8582959429 ఫోన్ నంబర్ నుంచి బ్లాక్ కో–ఆర్డినేటర్ పోస్టును ఇప్పిస్తామంటూ పలువురు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం ఉందని.. ఎవరూ మోసపోవద్దని ఆమె సూచించారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5–18 ఏళ్లలోపు వయస్సు కలిగిన బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ తెలిపారు. సామజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయిటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలలు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా 2025 జనవరిలో బహుమతి, జ్ఞాపిక అందిస్తారన్నారు.

## మట్టిని మింగేస్తున్న తెలుగు తమ్ముళ్లు!



జింగిలిపాళెం చెరువులో జేసీబీలతో మట్టిని తవ్వుతున్న అక్రమార్కులు

**శ్రీకాళహస్తి రూరల్:** అధికారాన్ని అడ్డంపెట్టుకుని కూటమి నేతలు అడ్డదిడ్డంగా సంపాదించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా చెరువులు, కాల్వలు, వాగులు, వంకల్లో జేసీబీల సాయంతో ఇష్టారాజ్యంగా మట్టి, ఇసుక తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఇలాంటిదే మండలంలోని జింగిలిపాళెంలో చోటు చేసుకుంది. నెలరోజులుగా జింగిళిపాళెం చెరువులో రెండు జేసీబీల సాయంతో ట్రాక్టర్లు పెట్టి మట్టిని అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒక ట్రాక్టర్ మట్టి రూ.800 నుంచి రూ.వెయ్యి రూపాయల వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం.

## 'చంద్రయాన్–3'కి మరో అంతర్జాతీయ గౌరవం



**సూళ్లూరుపేట:** బారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గత ఏడాది ఆగస్టు 23న చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగంతో విశ్వవాప్తంగా మంచి పేరు ప్రఖ్యాతులు రావడంతో అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్ ఇంటర్నేషన్ స్పేస్ అవార్డును ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబర్ 14న ఇటలీలోని మిలాన్‌లో జరగనున్న 75వ అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందజేయనున్నారు. ఇస్రో చంద్రయాన్–3 ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించడంతో పాటు విక్రమ్ ల్యాండర్‌ను చంద్రుడి దక్షిణ ధ్రువంపై సేఫ్ ల్యాండింగ్ చేసి చరిత్రను సృష్టించారు. దీంతో అమెరికా, రష్యా, చైనా తరువాత చంద్రుడిపై భారత్ అడుగుపెట్టిన విషయం విధితమే. చంద్రయాన్–3 ప్రయోగం తక్కువ ఖర్చుతో కూడిన ఇంజినీరింగ్‌కు ప్రత్యేక ఉదాహరణ అని అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్ పేర్కొంది. అంతరిక్ష పరిశోధనల్లో భారత్‌కు ఉన్న సామర్థ్యానికి ఈ ప్రయోగం ఒక చిహ్నమని కూడా వెల్లడించింది. చంద్రుడి నిర్మాణం, చంద్రుడి భూగర్భంలోని అంశాలను కూడా వెలుగులోకి తీసుకొచ్చిందని కొనియాడింది. చంద్రయాన్–3 మిషన్‌తో పాటు సరికొత్తగా చేస్తున్న ప్రయోగాలకు ఇదొక గ్లోబల్ అచీవ్‌మెంట్ అని ప్రశంసల వర్షం కురిపించింది.

## క్లుప్తంగా

### ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు

**నాయుడుపేటటౌన్:** మండల పరిధిలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ సమీపంలో వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్‌ఐ గోపి తెలిపారు. అయ్యప్పరెడ్డిపాళెం గ్రామం నుంచి అర్ధరాత్రి సమయంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందిందని, ఈ మేరకు సోమవారం అర్ధరాత్రి సమయంలో పోలీసులతో కలసి దాడులు చేసి ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు వెల్లడించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానులుగా ఉన్న కల్లిపేడు గ్రామానికి చెందిన ముగ్గురిని, అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం

**తడ:** తమిళనాడు నుంచి ఆంధ్రాకు భారీగా తరలివస్తున్న తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యాన్ని తడ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు నుంచి రేషన్ బియ్యం వస్తున్నట్టు తడ ఎస్‌ఐ నరేశం హారావుకు సమాచారం వచ్చింది. వెంటనే ఆయన సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్యకు సమాచారం అందించారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉమ్మడిగా బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించగా రెండు మినీ లారీల్లో బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. 201 బస్తాల్లో ఉన్న 9,920 కిలోల బియ్యంతోపాటు రెండు లారీలు, తమిళనాడుకు చెందిన ముత్తు, చెల్లప్ప దొరై అనే ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ రేషన్ బియ్యం విలువ రూ.2.97 లక్షలు ఉంటుందని నిర్ధారించారు.

### దైవదర్శనానికి వెళ్లి వస్తూ..



ప్రమాదంలో మృతి చెందిన శ్రీను

**ఓజిలి:** దైవదర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన జాతీయ రహదారి ఓజిలి క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా, చీమకుర్తి గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు ఆరుగురు కారులో ఈ నెల 20న అరుణాచలం బయలుదేరి వెళ్లారు. అక్కడ అరుణాచలేశ్వరిని దర్శనం చేసుకుని రెండు రోజులు అక్కడే గడిపారు. 22న ఉదయం తొమ్మిది గంటలకు కారులో చీమకుర్తికి తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో రాచపాళెం క్రాస్ రోడ్డు సమీపంలోని తారుప్లాంట్ వద్దకు వచ్చేసరికి రాత్రి 11.30 గంటలయ్యింది. ముందు వెళ్తున్న లారీ షడన్ బ్రేక్ వేయడంతో కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. కారులో వెనుక కూర్చొని ఉన్న చిన్నపురెడ్డి శ్రీను(40) తలకు బలమైన గాయమైంది. ఓజిలి, హైవే పోలీసుల సహాయంతో క్షతగాత్రుడిని గుడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మృతిచెందాడు. కారులోని అనుషా, లావణ్య, ప్రియాంకకు గాయాలయ్యాయి. వీరిని గూడూరు నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

'జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలన్నా.. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని కొనసాగించాలన్నా అసెంబ్లీ వేదికగా కూటమి ఎమ్మెల్యేలు గళం విప్పాలి. నూతన పరిశ్రమలకు నాంది పలికేవిధంగా ఒత్తిడి తేవాలి. అర్ధంతరంగా ఆగిన సాగునీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తిచేయాలి. గుంతలమయమైన రోడ్ల కోసం మరిన్ని నిధులు రాబట్టాలి. ఎన్నికల హామీల్లో ప్రధానమైన సూపర్ సిక్స్‌ను తక్షణం అమలు చేసే దిశగా చొరచూపాలి. విద్య, వైద్య రంగాలను అత్యున్నతంగా తీర్చిదిద్దాలి. అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచేవిధంగా బాబును ఒప్పించాలి. మత్యకార భరోసా నిధుల విడుదలకు డిమాండ్ చేయాలి' అని జిల్లా ప్రజానీకం ముక్తకంఠంతో నినదిస్తోంది. అమాత్యులు లేని జిల్లాను అభివృద్ధి పథంలో నడపాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. ప్రజల ఆశలు.. ఆకాంక్షను నెరవేర్చాలని సూచిస్తోంది.

# అధ్యక్షా.. ఇదే మా ఆకాంక్ష!



## అసెంబ్లీ సమావేశాలపై కోటి ఆశలు

- ప్రగతిపై గళం విప్పే బాధ్యత ఎమ్మెల్యేలదే
- కూటమి మేనిఫెస్టో అమలుకు డిమాండ్ చేయాలి
- గత ప్రభుత్వం చేపట్టిన స్కిల్ వర్సిటీని పూర్తిచేయాలి
- విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లాలో తాగు, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి
- సూపర్‌సిక్స్ హామీల బాధ్యత ప్రజాప్రతినిధులదే
- ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా ప్రజానీకం



**తిరుపతి సిటీ, తిరుపతి అర్బన్:** జిల్లాలో ప్రాజెక్టుల అభివృద్ధిపై గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నూతన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా ఆల్తూరు పాడు రిజర్వాయర్ విస్తరణకు రూ.600 కోట్లు కేటాయించింది. కానీ అప్పటి ఎమ్మెల్యే ఆనం రామ్‌నారాయణరెడ్డి కమీషన్లకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లను బెదిరించడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుపై అసెంబ్లీలో గళం వినిపించాలని ఆ ప్రాంత వాసులు సూచిస్తున్నారు. అదేవిధంగా మేర్లపాక లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.250 కోట్లు, ఆల్లూరుపాడుకు రూ.110 కోట్లు, మూలకాలువ ప్రాజెక్టుకు రూ.40 కోట్లు గత ప్రభుత్వం కేటాయించింది. మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్ అభివృద్ధికి రూ.12 కోట్లకు పైగా వెచ్చించింది. పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.35 కోట్లు , కాలంగి రిజర్వాయర్‌కు రూ.8 కోట్లు, కళ్యాణి డ్యామ్‌కు రూ.3.5 కోట్లు, తెలుగుగంగ ప్రాజెక్ట్ అభివృద్ధికి రూ.1,250 కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి చేసింది. 35 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలుగుగంగ ప్రాజెక్టు నుంచి రబీతో పాటు ఖరీఫ్‌నకు రెండు సీజన్లలోనూ సాగునీరు అందించింది. గత ప్రభుత్వం కేటాయించిన నిధులతో కొనసాగుతున్న పనులను నిలుపుదల చేయకుండా కొనసాగించేలా ప్రజాప్రతినిధులు అసెంబ్లీ వేదికగా గట్టిగా గళమెత్తాలని జిల్లా ప్రజలు సూచిస్తున్నారు.

### నూతన పరిశ్రమల స్థాపనకు నాందిపలకాలి

జిల్లాలో గత ప్రభుత్వ ప్రభుత్వం నూతన పరిశ్రమల స్థాపనకు రూ.21 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టింది. 44వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించింది. జపాన్, చైనా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్ దేశాల నుంచి పేరొందిన పారిశ్రామిక వేత్తలు జిల్లాను సందర్శించి పెట్టుబడులకు సిద్ధమయ్యారు. సత్యవేడు శ్రీసిటీ, నాయుడుపేట సెజ్, శ్రీకాళహస్తి, ఏర్పేడు, గూడూరు, రేణిగుంట ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు అనేక కంపెనీలు మొగ్గు చూపాయి. ఇందులో భాగంగా గూడూరు పరిధిలో 12 వేల ఎకరాల్లో రూ.5,800 కోట్లతో క్రిస్ సిటీ పేరుతో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గత ప్రభుత్వం బీజం వేసింది. అదేవిధంగా తిరుపతిలో రూ.1000 కోట్లతో 450 ఎకరాలలో కాన్సెప్ట్ సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కూటమి ఎమ్మెల్యేలు ఈ పరిశ్రమల స్థాపనకు ఏకవాక్య తీర్మానం చేసి అసెంబ్లీలో గళం వినిపించాలి.

### సూపర్‌సిక్స్‌పై గళం విప్పాలి

ప్రస్తుత ప్రభుత్వం ఆర్భాటంగా హామీలిచ్చిన సూపర్ సిక్స్ మాట పూర్తిగా విస్మరించింది. అసెంబ్లీ సమావేశాలలో సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యేలు గళం విప్పాల్సిన అవసరం ఉంది. రూ.3 వేల నిరుద్యోగ భృతి, జాబ్‌క్యాలెండర్, మెగా డీఎస్సీకి రీ నోటిఫికేషన్, తల్లికి వందనం, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్, అన్నదాత సుఖీభవ పేరుతో రైతుకు రూ.20వేల సాయం, మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి అంశాలపై చర్చ జరగాలని, వాటిని వెంటనే అమలు చేసే దిశగా ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సి ఉంది.

### అన్నదాతకు వెన్నుదన్నుగా నిలవాలి

జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 445 ఆర్బీకేలు ఏర్పాటు చేసి, 5.20 లక్షల మంది రైతులకు సేవలందించింది. 1,80,654 మందికి రూ.706.07 కోట్లు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించింది. ఉచిత పంటల బీమా పథకం ద్వారా 33,295 మందికి రూ.23.04 కోట్ల మేర ప్రీమియం చెల్లించింది. సున్నావడ్డీ ద్వారా 72,410 మందికి రూ.14 కోట్ల వడ్డీ రాయితీ కల్పించింది. 2023 కాలంలో 3,01,520 మందికి రూ.4,988 కోట్లు, ఖరీఫ్‌లో 52,132 మందికి రబీలో రూ.1,234 కోట్ల రుణాలు అందించింది. యంత్రసేవా పథకం ద్వారా 472 కష్టమర్ హెయిరింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు అందించింది. ప్రస్తుత ప్రభుత్వం రైతులను విస్మరించకుండా వీటన్నింటినీ కొనసాగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

### సంక్షేమం కొనసాగాలి



గత ప్రభుత్వం జిల్లాలోని 34 మండలాల్లో 691 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 16.64 లక్షల మందికి ఇంటివద్దకే పౌరసేవలను అందించింది. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను సుమారు 44,501మంది విద్యార్థులకు నిరాటంకంగా కొనసాగించింది. అమ్మఒడి పథకంలో భాగంగా ప్రతి ఏటా జిల్లాలో 2,20,890మందికి రూ.331.34కోట్లు పంపిణీ చేసింది. జిల్లాలోని 2,090 ప్రాథమిక పాఠశాలలు, 321 ప్రాథమికోన్నత, 524 ఉన్నత పాఠశాలలు, 189జూనియర్ కళాశాలల్లో నాడు–నేడు, మనబడి పథకాల ద్వారా వేల కోట్లు ఖర్చు పెట్టి రూపురేఖలు మార్చింది. ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, చేయూత, కాపునేస్తం, సున్నావడ్డీ, ఆసరా, శ్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా వేలది కోట్లు మహిళల ఖాతాల్లోకి నేరుగా జమచేసింది. వీటన్నింటినీ కొనసాగించేలా కూటమి ఎమ్మెల్యే కృషిచేయాలి.

### మత్స్యకార భరోసా కోసం ఎదురు చూపు



జిల్లాలో 10 వేల మందికి పైగా మత్స్యకారులున్నారు. గత ప్రభుత్వం వేట నిషేధ సమయంలో భృతిని రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచింది. మత్స్యకారుల ఉపాధిలో భాగంగా 3,669 మందికి రూ.3.66 కోట్లు 90 శాతం రాయితీతో రుణాలు ఇప్పించింది. ప్రమాద బీమా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు పెంచింది. మత్స్యకార భరోసాను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచింది. కానీ ఇంతవరకు ఈ నిధుల ఊసేలేదు. వెంటనే నిధులు మంజూరయ్యేలా ప్రజాప్రతినిధులు తమ గళాన్ని వినిపించాలి.

### స్కిల్ వర్సిటీని పూర్తి చేయాలి

జిల్లాలో శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, కోబాక సమీపంలో గత ప్రభుత్వం రూ.150 కోట్లతో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. దీని కోసం సుమారు 50ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ప్రస్తుత ప్రభుత్వం వర్సిటీని త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ దిశగా అసెంబ్లీలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గళం విప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ప్రధానంగా ఉచిత బస్సు, కుటుంబంలోని ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ నెలలోనే అమలు చేస్తారని నమ్ముతున్నాం. అసెంబ్లీ సమావేశాలలో ఈ విషయంపై చర్చించాలి. జిల్లాలో సుమారు 12 లక్షల మందికి పైగా మహిళలు ఈ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమై సుమారు రెండు నెలలు అవుతున్నా తల్లికి వందనంపై క్లారిటీ ఇవ్వలేదు. జిల్లాలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు అరికట్టాలి. వీటిపై ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళమెత్తాలి.

– ఎల్‌ఎస్.లక్ష్మి, ఏఐఎమ్ఎస్ మహిళా సంఘం ఇన్‌చార్జి, తిరుపతి

### ప్రజాసమస్యలపై గళమెత్తాలి



ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలపై జిల్లా ఎమ్మెల్యేలు గళం విప్పాలి. గత ప్రభుత్వం అమలు చేసిన, పెండింగ్‌లో ఉన్న విద్య, వైద్యరంగాలకు సంబంధించిన పనులను ఆపివేయకుండా నిధులు కేటాయించి పూర్తిచేయాలి. వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించే రైతుభరోసాను ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చే విధంగా ఎమ్మెల్యేలు ఒత్తిడి తేవాలి. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలి. నిరుద్యోగులకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ వర్సిటీని త్వరిత గతిన పూర్తి చేయాలి. ప్రజాస్వామ్యంలో కక్ష్యసాధింపు చర్యలను విడనాడి జిల్లా అభివృద్ధికి సహకరంచేలా ఎమ్మెల్యేలు తమ గళాన్ని అసెంబ్లీలో వినిపించాలి.

–శ్యామ్‌సుందర్, పరిశోధక విద్యార్థి, శ్రీకాళహస్తి

### సూపర్‌సిక్స్ హామీలపై గట్టిగా నిలదీయాలి



అసెంబ్లీ సమావేశాలలో గవర్నర్ ప్రసంగం నిరాశ కలిగించింది. ఓటాన్ అకౌంట్‌తో అభివృద్ధి అసాధ్యం. సూపర్‌సిక్స్ హామీలకు చరమగీతం పాడేందుకే కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి ఓటాన్ అకౌంట్‌ను తెరపైకి తెచ్చింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలి. పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా అభివృద్ధిని కొనసాగించింది. తొలి బడ్జెట్ సమావేశాల్లోనే ఇచ్చిన హామీల్లో 90 శాతం పథకాలకు బడ్జెట్ కేటాయించింది. సూపర్‌సిక్స్ హామీలపై జిల్లాలోని ఏడుగురు ప్రజాప్రతినిధులు తమ వాణిని అసెంబ్లీలో గట్టిగా వినిపించాలి.

–రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

### నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపు



అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో ఎక్కడా నిరుద్యోగుల ప్రస్తావన లేదు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఆ మాట ఎత్తడం లేదు. జిల్లాలో సుమారు 6 లక్షలకు పైగా నిరుద్యోగులు ఉన్నారు. వారంతా నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో పాటు జాబ్ క్యాలెండ్ విడుదల చేసి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలి. జిల్లాలో అందరూ కూటమి ఎమ్మెల్యేలే ఉన్నారు. నిరుద్యోగుల హామీలపై అసెంబ్లీలో గళమెత్తాలి.

–హరీష్, సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు, చంద్రగిరి

## అండర్ -16 క్రికెట్ పోటీలు ప్రారంభం

**వెంకటగిరి రూరల్:** ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–16 విభాగం క్రికెట్ పోటీలు పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటి ఇన్నింగ్స్‌లో విశాఖపట్నం– విజయనగరం జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. తొలుత టాస్ గెలిచిన విశాఖపట్నం జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 53.03 ఓవర్లకు 101 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో హిమల్ 28 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు 36 ఓవర్లకు 176 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోయింది. జట్టులో భానుశ్రీహర్ష 80 పరుగులు, రోహణ్ గణపతి 28 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో గౌతమ్ ఆర్య 4 వికెట్లు తీశారు. విజయనగరం జట్టు బౌలింగ్ విభాగంలో దేవిచరణ్ 2 వికెట్లు పడగొట్టాడు. 75 పరుగుల తేడాతో విశాఖపట్నం జట్టు లీడ్‌లో ఉంది.



## పగతోనే చంపేశాడు!



నిందితుడిని చూపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి క్రైమ్:** నగరంలోని రాయల్‌నగర్‌లో సంచలనం సృష్టించిన హత్య కేసులో పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. తనపై తప్పుడు ప్రచారం చేశారనే పగతో హంతకుడు ఓ వృద్ధురాలిని దారుణంగా హత్య చేసినట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఈనెల 18న జరిగిన వృద్ధురాలు జయలక్ష్మి హత్య కేసులో రాయల్‌నగర్ నాలుగో క్రాస్‌లో నివాసముంటున్న పిన్నబోయిన శ్రీనివాసులు(22) అలియాస్ శ్రీను, చిన్నను చర్లపల్లి వద్ద అరెస్ట్ చేసినట్టు తెలిపారు. హత్య గురించి విచారించగా ఆసక్తికర విషయాలు బయటపడ్డాయన్నారు. తిరుపతి రాయల్ నగర్‌లో శ్రీనివాసరావు తల్లి జయలక్ష్మి, భార్య రక్ష, కూతుళ్లు ప్రేరణ, నియతి నివసిస్తున్నారని, వీరి పక్కింట్లోనే హంతకుడు శ్రీనివాస్ కూడా నివాసముంటున్నాడని చెప్పారు. 2019లో తన తండ్రి మందలించాడని శ్రీనివాస్ హైదరాబాద్ వెళ్లి అక్కడే హాస్టల్‌లో ఉంటూ వెయిటర్‌గా పనిచేశాడు. అయితే శ్రీనివాసరావు భార్య రక్ష ముద్దాయి శ్రీనివాస్ ఎవర్నో ఒక అమ్మాయిని తీసుకొని వెళ్లిపోయాడని ప్రచారం చేసింది. మృతురాలు జయలక్ష్మి కూడా శ్రీనివాస్ కనిపిస్తే తిట్టేది. దీంతో వీరిపై అతను కక్ష పెంచుకున్నాడు.

**గతంలోనే ఒకసారి భయం చూపించాడు**

శ్రీనివాస్ 2003 మార్చిలో జయలక్ష్మి, రక్షను భయపెట్టాలని వారి ఇంట్లో సన్‌సైడ్‌పై ఎదురుగా మూడు ఖాళీ బీరు బాటిల్స్‌లో పెట్రోల్ పోసి ఒత్తులు పెట్టి మండించాడు. అదేవిధంగా 20 రోజుల క్రితం సీసీ కెమెరాలకు కనిపించకుండా దుప్పటి అడ్డం వేసుకొని ఇంట్లోకి వెళ్లాలని ప్రయత్నించగా పెద్ద గాలి రావడంతో దుప్పటి కిందపడిపోయింది. ఈ క్రమంలో వారిపై కక్ష పెంచుకొని జయలక్ష్మిని హతమార్చి, అడ్డొచ్చిన చిన్న మానవరాల్ని, అదే సమయంలో ఇంటికి వస్తున్న కోడలు రక్ష, పెద్ద మనవరాలిని గాయపరిచాడని తెలిపారు.

## అంగన్‌వాడీ టీచర్‌పై టీడీపీ వేధింపులు

- సీడీపీఓ ద్వారా రాజీనామా చేయాలని ఒత్తిడి
- ఒత్తిడి తాళలేక స్పృహతప్పి పడిపోయిన కార్యకర్త



మన్నవరం అంగన్‌వాడీ కేంద్రం వద్ద స్పృహ తప్పి పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి

**శ్రీకాళహస్తి రూరల్:** టీడీపీ నేతల ఒత్తిళ్లు తాళలేక ఓ అంగన్‌వాడీ కార్యకర్త తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం శ్రీకాళహస్తి మండలం, మన్నవరం గ్రామంలో చోటుచేసుకుంది. మన్నవరం దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో వీ.గాయత్రి అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామంలోని స్థానిక టీడీపీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్తపై కక్షగట్టారు. శ్రీకాళహస్తి సీడీపీఓ ద్వారా రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అంతటితో ఆగకుండా అంగన్‌వాడీ కార్యకర్త స్థానికంగా ఉండడం లేదన్న సాకుతో సీడీపీఓ ద్వారా మెమో ఇప్పించారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో అంగన్‌వాడీ కార్యకర్త సీఐటీయూ నాయకుల ద్వారా కలెక్టర్‌ను కలిసి తన పరిస్థితిని వివరించారు. కలెక్టర్‌ను కలిశారన్న కోపంతో మంగళవారం సీడీపీఓ శాంతి దుర్గ గ్రామంలోకి వచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలను, గ్రామంలోని బాలింతలను ఎవర్నీ వివరణ చేయకుండా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యకర్త పైన చర్యలు తీసుకునేందుకు పూనుకున్నారు. ఇదేమిటని అడిగిన అంగన్‌వాడీ కార్యకర్తపై సీడీపీఓతో పాటు గ్రామానికి చెందిన కొందరు టీడీపీ మహిళలు దురుసుగా ప్రవర్తించారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త గాయత్రి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆపై అంగన్‌వాడీ కేంద్రం వద్దే అస్వస్థతకు గురై పడిపోయారు. స్థానికులు 108 వాహనంలో ఆమెను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తను సీఐటీయూ జిల్లా నాయకులు పరామర్శించారు.

**ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన**

సీడీపీఓ శాంతిదుర్గ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అంగన్‌వాడీ కార్యకర్తలను తొలగించేందుకు పూనుకున్నారని, ఈ క్రమంలో వారి వద్ద నుంచే రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారంటూ శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ సీడీపీఓ అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని, ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు అంగన్‌వాడీ కార్యకర్తపై కూడా రాజకీయ వేధింపులు మొదలయ్యాయన్నారు.

### గ్రామస్తుల ఫిర్యాదుతోనే విచారణ

శ్రీకాళహస్తి మండలం, మన్నవరం గ్రామ సెక్టార్ సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశాం. ఇందులో రాజకీయం ఏమీ లేదు. అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో భాగంగా స్కూల్ టీచర్‌తో కలిసి ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్యం, పోషణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం అనంతరం తిరిగి వస్తుండగా మన్నవరం గ్రామస్తులు అంగన్‌వాడీ కార్యకర్త సక్రమంగా విధులు నిర్వహించలేదని ఫిర్యాదుచేశారు. వారు ఇచ్చిన నివేదికను మాపై ఉన్నతాధికారులకు పంపుతాము. మా డ్యూటీ మేం చేస్తున్నాం. గ్రామంలో ఫిర్యాదు వస్తే వెళ్లి విచారణ చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. మాపై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి.

– శాంతిదుర్గ సీడీపీఓ, శ్రీకాళహస్తి